క్లుప్తంగా

రేపు స్పాట్ కౌన్సెలింగ్

ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం, కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలోని వివిధ బైపీసీ కోర్సులలో నాలుగు విడుతల కౌన్సెలింగ్ నిర్వహించిన తర్వాత ఆయా కోర్సులలో మిగిలిన సీట్ల భర్తీకి ఈ నెల 25న స్పాట్ కౌన్సెలింగ్ ఉంటుందని రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ తెలిపారు. బీఎస్సీ హానర్స్, కమ్యూనిటీ సైన్స్, మరియు బీఎస్సీ ఫిషరీ సైన్స్‌లలో మిగిలిన సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ ఉంటుందని ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ హాజరవ్వాలన్నారు.

బద్దం బాల్‌రెడ్డికి ఘన నివాళి

గోల్కొండ: నగరంలో బీజేపీని బలీయమైన శక్తిగా తీర్చిదిద్దిన నాయకుల్లో దివంగత మాజీ ఎమ్మెల్యే బద్దం బాల్‌రెడ్డి ఒకరని బీజేపీ రాష్ట్ర నాయకుడు దేవర శ్రీనివాస్ అన్నారు. గురువారం గుడిమల్కాపూర్ చౌరస్తా వద్ద బద్దం బాల్‌రెడ్డి 4వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు బద్దం బాల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. మజ్లిస్ పార్టీకి గట్టి పోటీనిస్తూ ఆ పార్టీ ఆగడాలను ఎండగడుతూ నగర ప్రజల ఆదరణనూ చూరగొన్న అజాత శత్రువు బద్దం బాల్‌రెడ్డి అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ యువ నాయకులు దేవర వంశీ, అశోక్ యాదవ్, నామ యాదగిరి, రాధాకృష్ణయాదవ్, కట్ల అశోక్, అశ్విన్ మోది, రక్షిత్ సాగర్, ప్రభు పూజారి, అశ్విన్ తదితరులున్నారు.

అందుబాటులోకి నూతన బస్సు

అఫ్జల్‌గంజ్: ఉస్మానియా నర్సింగ్ విద్యార్థుల సౌకర్యార్థం వైద్యాధికారులు మంజూరు చేసిన నూతన బస్సు అందుబాటులోకి వచ్చింది. ఈ మేరకు గురువారం కొత్త బస్సును ఆస్పత్రి అదనపు సూపరింటెండెంట్ డాక్టర్ త్రివేణీ, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ శేషాద్రితో కలసి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్ పూజలు నిర్వహించిన అనంతరం జెండా ఊపి ప్రారంభించారు. గతంలో నర్సింగ్ వైద్య విద్యార్థుల ఉపయోగించిన మినీ బస్సు కాల పరిమితి ముగియడంతో ఆ బస్సు తరచూ రోడ్లపై మొరాయిస్తుండడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. నర్సింగ్ విద్యార్థుల అభ్యార్థన మేరకు డాక్టర్ నాగేందర్ ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నూతన బస్సును మంజూరు చేయించారు. దీంతో అందుబాటులోకి వచ్చిన బస్సును వారు ప్రారంభించారు.


ఇంద్రజాలం గొప్ప కళ

గన్‌ఫౌండ్రీ: ఇంద్రజాల ప్రదర్శన గొప్ప కళ అని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం అన్నారు. ఈ మేరకు గురువారం నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయంలో తెలుగు విశ్వవిద్యాలయం, మెజిషియన్ల సంయుక్త ఆధ్వర్యంలో మెజిషియన్ డే వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంద్రజాలికులు తమ అద్భుతమైన నైపుణ్యంతో ప్రజలను ఎంతో ఆశ్చర్యచకితులను చేస్తారని కొనియాడారు. తెలుగు విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ కిషన్‌రావు మాట్లాడుతూ.. సీనియర్ తెలంగాణ కళాకారులను గుర్తించి వారి సలహాలు, సూచనలను జూనియర్ విద్యార్థులకు వివరిస్తామని తెలిపారు. అనంతరం ఇంద్రజాలికులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మెజిషియన్స్ అకాడమీ వ్యవస్థాపకులు సామల వేణు ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లిపిడ్ జీవక్రియలో కాలేయానిదే ప్రధానపాత్ర

రాయదుర్గం: లిపిడ్ జీవక్రియలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తుందని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక బృందం వెల్లడించింది. ఈ వ్యాసం అంతర్జాతీయ నేచర్ కమ్యూనికేషన్స్‌లో ప్రచురించారు. హెచ్‌సీయూలోని స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్‌లోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోకెమిస్ట్రీకి చెందిన ప్రొఫెసర్ నరేష్‌బాబు సేపూరి ఆధ్వర్యంలో బృందం అధ్యయనం చేసింది. ఈ బృందంలో డాక్టర్ నోబుల కుమార్ తలారి, డాక్టర్ ఉషోదయ మట్టం, నీరజ్‌కుమార్, అరుణ్‌కుమార్, డాక్టర్ తనూజా కృష్ణమూర్తి, డాక్టర్ కళ్యాణ్కర్ మహదేవ్ సహకారంతో ఈ అధ్యయనం చేశారు. ముఖ్యంగా ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎఫ్ఎల్‌డి) ముఖ్యంగా నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్(ఎన్ఏఎఫ్ఎల్‌డి) అనేది ప్రపంచ జనాభాలో 25 శాతం మందిని ప్రభావితం చేసే తీవ్రమైన ఆరోగ్య సమస్య అని పరిశోధనలో వెల్లడించారు. ఇది పొత్తికడుపులో కొవ్వు పేరుకుపోవడం, ఇన్సులిన్ నిరోధకత, టైప్-2-డయాబెటిస్ మెల్లిటస్, హైపర్ టెన్షన్, డైస్లిపిడెమియా, కార్డియోవాస్కులర్ సమస్యలతో సహా జీవక్రియ అసాధారణతల ద్వారా వర్గీకరించబడుతుంది.

మనూలో జాతీయ సదస్సు



రాయదుర్గం: 'ఖురాన్'పై మనూలో గురువారం కేరళ ఇంటర్నేషనల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ తఫ్సీర్ అల్‌ఖురాన్, ఉర్దూ విశ్వవిద్యాలయం అరబిక్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు ఖురాన్ యొక్క దక్కనీ, పర్షియన్ భాషల గురించి వివరించారు. ఖురాన్ ప్రాధాన్యతను వివరించారు.

అగ్గి రాజుకుంటే బుగ్గే!



నిబంధనలు పాటించని పరిశ్రమలు
తరచూ సంభవిస్తున్న అగ్ని ప్రమాదాలు
భయాందోళనలో ప్రజలు
దృష్టి సారించని అధికారులు

వేసవి సమీపించిందంటే బస్తీల వాసుల గుండెల్లో గుబులు మొదలవుతుంది. ఎప్పుడు అగ్ని ప్రమాదం జరుగుతుందో ఎక్కడి నుంచి మంటలు వ్యాపిస్తాయో అని కంటికి కునుకు లేకుండా గడుపుతున్నారు. కాటేదాన్, మైలార్‌దేవ్‌పల్లి, గగన్‌పహాడ్, శాస్త్రీపురం, బాబుల్‌రెడ్డినగర్, టీఎన్‌జీవోస్ కాలనీ, ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాల్లో అక్రమంగా వెలిసిన ప్లాస్టిక్ వ్యర్థాల పరిశ్రమలు, మూతబడిన ఖార్కానాల్లో ఎప్పుడు అగ్ని ప్రమాదాలు జరుగుతాయో అని జంకుతున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఒక్కచోటగా చేర్చి ముడి సరుకుగా మార్చే పరిశ్రమల్లో స్థానికంగా ఉన్న రోడ్లపైనే వ్యర్థాలను డంప్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. ఎలాంటి అనుమతి లేకుండా పరిశ్రమలను స్థాపిస్తూ అగ్ని ప్రమాదాలకు కారణమవుతున్నారు. అగ్ని ప్రమాదాలు జరిగిన సందర్భంలో స్థానికులు దట్టమైన పొగలతో అనారోగ్యాలకు గురవుతున్నారు.

– మైలార్‌దేవ్‌పల్లి

పరిశ్రమల్లో సరైన వసతులు, అందుకు సంబంధించిన పరికరాలు లేకపోవడం, ప్రమాదాలు జరిగినప్పుడు నివారించలేకపోతున్నారు. కాటేదాన్ పరిసర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో తప్పనిసరిగా అగ్నిమాపక నియంత్రణ అనుగుణంగా నిర్మాణాలు చేపడుతూ అందుకు సంబంధించిన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలని ఇటీవల పోలీసు అధికారులు పరిశ్రమల యజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశారు. అధికారుల హెచ్చరికలను బేఖాతరు చేస్తూ తమ ఇష్టానుసారంగా పరిశ్రమలు నిర్వహించడంతో అగ్ని ప్రమాదాలు జరుగుతున్నాయి. నెలలో 2–3 అగ్ని ప్రమాదాలు జరుగుతూ స్థానిక ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

కానరాని తనిఖీలు

ఎలాంటి అనుమతులు లేకపోవడం ఒక వైపు కావాలని యాజమాన్యాలు తగులబెట్టుకోవడం జరుగుతుందని ప్రమాదాలు సంభవించిన సమయంలో ఫిర్యాదులు చేయకుండానే సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయడం లేదు. దీంతో ప్రమాదంలో జరిగిన మొత్తాన్ని గుర్తించకపోవడం ఫిర్యాదు చేయకపోవడంతో దర్యాప్తు సాగడం లేదు. స్థానికంగా ఉన్న పరిశ్రమలకు అనుగుణంగా అగ్నిమాపక కేంద్రాలు లేకపోవడంతో ఇతర ప్రాంతాల నుంచి సంఘటన స్థలానికి చేరుకునే సరికి అగ్ని ప్రమాదానికి గురైన గోదాంలు, షెడ్‌లు, పూర్తిగా కాలిపోతున్నాయి. పరిశ్రమలపై సంబంధిత అధికారులు తనిఖీలు చేపట్టకపోవడంతో కూడా ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పరిశ్రమలు ఉన్న ప్రాంతాల్లో పర్యటించి నిబంధనలు ఉల్లంఘించి కొనసాగుతున్న వాటిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ప్రమాదంలో దగ్ధమైన పలు వాహనాలు(ఫైల్)



రోడ్డుపైనే డంప్ చేసిన వ్యర్థాలు



మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది(ఫైల్‌ఫోటో)

తనిఖీలు నిర్వహిస్తున్నాం..



ఇటీవల నగరంలో జరుగుతున్న అగ్నిప్రమాదాలతో ప్రజలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. గత వారం రోజులుగా కాటేదాన్, గగన్‌పహాడ్, లక్ష్మిగూడ, మైలార్‌దేవ్‌పల్లి తదితర ప్రాంతాల్లో ఉన్న పరిశ్రమల్లో తనిఖీలు చేస్తున్నాం. అగ్ని ప్రమాదాలు జరిగిన సమయంలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాదాల నివారణకు కావాల్సిన పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలి. త్వరలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, రాజేంద్రనగర్ అగ్నిమాపక అధికారులతో కలిసి అగ్నిప్రమాదాల అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తున్నాం. ఎలాంటి ప్రమాదాలు జరిగిన 87126 99460 నంబర్‌కు ఫిర్యాదు చేయాలి. –జగన్‌మోహన్, రాజేంద్రనగర్ అగ్నిమాపక కేంద్రం ఆఫీసర్



భూసార పరీక్షలతో ఎంతో మేలు

ఏజీవర్సిటీ: ఎలాంటి నేలలైనా ఏ పంటలైన భూసార పరీక్షలు ఎంతో అవసరమని శాస్త్రవేత్త మైలవరపు సాంబశివరావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో గురువారం భూసార శాస్త్ర విభాగం, హైదరాబాద్ చాప్టర్ ఇండియన్ సొసైటి ఆఫ్ సాయిల్ సైన్ ఆధ్వర్యంలో నిర్వహించిన భూసార పరీక్షలపై ఉపాన్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భారతదేశంతో పాటు అమెరికా ఇతర దేశాలలో వివిధ పంటలలో పోషకయాజమాన్యంలో జరుగుతున్న పరిశోధన గురించి వివరించారు. వివిధ పోషకాల పనితీరు వాటిని వివిధ రూపాలలో పంటలకు అందించే తీరును కొన్ని మూలకాలతో ఉద్భవించే సమస్యల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పీజీ స్టడీస్ డీన్ డాక్టర్ అనిత, అసోసియెట్ డీన్ నరేందర్‌రెడ్డి, ఇతర శాస్త్రవేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

పనుల అడ్డగింపు: ట్రాక్టర్ సీజ్

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎర్రబోడలోని ప్రభుత్వ స్థలంలో చేపడుతున్న పనులను గురువారం రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు అడ్డుకుని ఓ ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. సర్వే నెంబర్ 7లోని ప్రభుత్వ స్థలంలో గుర్తు తెలియని వ్యక్తులు స్థలాన్ని చదును చేసి బండరాళ్లను తొలగిస్తున్నారు. స్థానికుల ఫిర్యాదు మేరకు రెవెన్యూ అధికారులు ఘటనా స్థలాన్ని చేరుకున్న పనులు అడ్డుకున్నారు. గతంలో ఎన్నడూ ప్రభుత్వ స్థలంలో నిర్మాణాలను అడ్డుకోని పోలీసులకు ఫిర్యాదు చేసిన దాఖలాలు లేవు. మొదటిసారిగా రెవెన్యూ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం.

ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ హైదర్షాకోట్‌లో విజయ గణపతి దేవాలయం 15వ వార్షికోత్సవాలు ఘనంగా జరిగాయి. ఉదయం నుంచి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ రకాలు పూలు, రంగురంగుల విద్యుత్ దీపాలతో దేవాలయాన్ని అలంకరించారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని తగు ఏర్పాట్లు చేశారు. ఈ పూజల్లో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షులు కృష్ణారెడ్డి, టింకు రెడ్డి పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న భక్తులు

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

మైలార్‌దేవ్‌పల్లి: కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సెంట్రల్ మెడికల్ టీమ్ మానిటర్ సంతోష్ అన్నారు. ఇటీవల అమ్మవారు సోకుతూ పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఈ మేరకు సెంట్రల్ టీమ్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, శివరాంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బాబుల్‌రెడ్డినగర్‌లో ఇంటింటా పర్యటించారు. తట్టు ఒకరి నుంచి మరొకరికి సోకుతూ తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తుందని ప్రజలకు వివరించారు. సీజనల్‌గా వ్యాధుల బారిన పడకుండా ఆరు నెలల పిల్లల నుంచి ఐదేళ్ల వరకు ఈ వ్యాక్సిన్ వేయడం జరుగుతుందని వ్యాక్సిన్ పట్ల సంబంధిత అధికారులు అప్రమత్తం చేస్తూ కార్యక్రమాలు చేపడుతున్నట్లు సంతోష్ వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వందన, సీహెచ్‌వో సిరాజుద్దీన్, అనురాధా, లక్ష్మి, రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, కేశవులు, పద్మ, సరిత, సూపర్‌వైజర్ గౌరీ, వసంత, ముత్తమ్మ పాల్గొన్నారు.

వీధి కుక్కల పట్టివేత

బండ్లగూడ: వీధి కుక్కలతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తుండడంతో సిబ్బందితో కుక్కలను పట్టించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన సంఘటనను దృష్టిలో ఉంచుకుని బ్లూ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో కుక్కలను పట్టించడం జరిగిందన్నారు. పిల్లలను బయటకు ఒంటరిగా పంప వద్దని, కుక్కలతో ఎలాంటి ఇబ్బంది కలిగిన తమ దష్టికి తీసుకురావాలన్నారు. హైదరాబాద్‌లో కుక్కలతో జరిగిన చిన్నారి మరణంతో ప్రజలు భయాందోళనకు గురికాకూడదని తగు చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని డివిజన్లలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని బ్లూ క్రాస్ వారికి తెలిపామన్నారు.

హైదర్‌గూడ, ఎర్రబోడ, న్యూ ఫ్రెండ్స్ కాలనీల్లో..

రాజేంద్రనగర్: దక్షిణ మండలం జీహెచ్ఎంసీ వెటర్నరీ విభాగం అధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో సిబ్బంది గురువారం హైదర్‌గూడ, ఎర్రబోడ, న్యూ ఫ్రెండ్స్ కాలనీ, తేజస్వీనగర్, శివానగర్ తదితర ప్రాంతాల్లోని కుక్కలను పట్టుకున్నారు. వీటికి శాస్త్ర చికిత్స నిర్వహించి తిరిగి ఇదే ప్రాంతంలో వదిలి వేస్తామని అధికారులు తెలిపారు. ఎర్రబోడలో ఐదుగురు చిన్నారులపై వీధి కుక్కలు దాడి చేసి గాయపరచడంతో అధికారులు స్పందించి ఈ డ్రైవ్ చేపట్టారు. గురువారం పట్టుకున్న వీధి కుక్కలలో పిచ్చి కుక్కలు లేవని అధికారులు వెల్లడించారు.



కుక్కలను పట్టుకుంటున్న సిబ్బంది

శునకాలతో స్నేహంగా మెలగాలి



అవగాహన కల్పిస్తున్న కమిషనర్

మణికొండ: కుక్కలను కొట్టడం, బెదిరించటం చేయకుండా వాటితో స్నేహం, ప్రేమగా ఉంటే వాటి నుంచి సమస్య రాదని మణికొండ మున్సిపల్ కమిషనర్ కె.ఫల్గుణ్‌కుమార్ అన్నారు. గురువారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు కుక్కలు దాడి చేసినపుడు ఏ విధంగా ఆత్మరక్షణ చేసుకోవాలనే దానిపై బ్లూక్రాస్ ప్రతినిధులు, జంతు సంరక్షణ వాలంటీర్లతో కలిసి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వాహనాలు వేగంగా వెళ్తుంటే వెంట పడతాయని, అలాంటి సమయంలో వేగాన్ని తగ్గిస్తే మౌనంగా ఉంటాయన్నారు. కొన్ని సందర్భాల్లో వాటికి ఆహారం, నీరు దొరక్క వింతగా ప్రవర్తించి మనుషులను కరుస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ శానిటేషన్ ఇన్‌చార్జి సంపత్, బ్లూక్రాస్ ప్రతినిధులు నవీన్, గురుమిత్, జయశ్రీ, ప్రధానోపాధ్యాయుడు నిరంజన్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



చార్మినార్: ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని బేగం పేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. గురువారం చార్మినార్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిటీ కాలేజీలో విద్యార్థులకు, సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మైనర్ల డ్రైవింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్, స్టాప్ లైన్, జీబ్రా క్రాసింగ్, ట్రిబుల్ రైడింగ్, సిగ్నల్ జంపింగ్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే తమను తాము రక్షించుకోవడమే కాకుండా ఇతరుల ప్రాణాలను కూడా కాపాడవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బాలభాస్కర్, కార్యక్రమం నిర్వహణాధికారి డాక్టర్ జయ కాగడా తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

శంషాబాద్ రూరల్: నిర్మానుష్య ప్రాంతంలో ఓ గుర్తు తెలియని మహిళ (35) మృతదేహం లభించింది. ఇన్‌స్పెక్టర్ ఏ.శ్రీధర్‌కుమార్ వివరాల ప్రకారం..మండలంలోని మల్కారం శివారులో ఉన్న మధుపాల వెంచరులోని నిర్మానుష్య ప్రాంతంలో మహిళ మృతదేహం ఉన్నట్లు సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని మృతురాలి ఒంటిపై గులాబీ రంగు చీర, కళ్లద్దాలు, మెడలో తాళాలు కల్గిన పూసల దండతో పాటు సెల్‌ఫోన్ ఉన్నాయన్నారు.

పనికెళ్లిన యువకుడి అదృశ్యం



గిరిబాబు

మైలార్‌దేవ్‌పల్లి: పనికి వెళ్లిన ఓ యువకుడు అదృశ్యమైన ఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతానికి చెందిన గిరిబాబు(28) లేబర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 17న పనికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లిన గిరిబాబు రాత్రైనా రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఇంట్లో చోరీ

మైలార్‌దేవ్‌పల్లి: ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలిలా.. పప్పురామ్ కుటుంబ సభ్యులతో కలిసి మైలార్‌దేవ్‌పల్లి గణేష్‌నగర్‌లో ఉంటున్నారు. కుటుంబ వ్యవహారాలు, వ్యాపారం పని నిమిత్తం కుటుంబ సభ్యులు ఇంటికి తాళం వేసి పక్కనే బాత్రూమ్‌లో తాలం చేవి పెట్టి వెళ్లారు. దొంగలు తాలం తీసి ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న ఆరు తులాల బంగారు దొంగిలించారు. ఇంటికి వచ్చిన పప్పురామ్ కుటుంబ సభ్యులు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పాదచారిపై కత్తితో దాడి

చాంద్రాయణగుట్ట: ర్యాష్‌గా డ్రైవింగ్ ఎందుకు చేస్తున్నావని అడిగిన పాదచారిపై ద్విచక్ర వాహనదారుడు కత్తితో దాడి చేసి గాయపరిచిన ఘటన ఫలక్‌నుమా పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మైలార్‌దేవ్‌పల్లికి చెందిన 16 ఏళ్ల మైనర్ బాలుడు ఫలక్‌నుమాలో బుధవారం రాత్రి మెడికల్ షాప్‌కు నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ సమయంలో ఓ 17 ఏళ్ల యువకుడు బైక్‌ను ర్యాష్ డ్రైవింగ్ చేస్తూ 16 ఏళ్ల బాలుడికి తగిలించాడు. చూసుకొని పోవచ్చు కదా అని ఆ బాలుడు అడగడంతో గొడవ మొదలయ్యింది. కోపంతో అక్కడి నుంచి వెళ్లిన యువకుడు తన స్నేహితుడు అలీ(18)ని తీసుకొచ్చి బాలుడిపై దాడి చేశాడు. తీవ్ర ఆగ్రహానికి గురైన అలీ కత్తితో బాలుడి కడుపులో పొడిచి పరారయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు బాధితుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్-5వ డివిజన్ కార్పొరేటర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. శ్రీరామ్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంటి సమస్యలు ఉన్న ప్రజల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. కంటి సమస్యలు ఉన్నవాళ్లు సమీపంలోని కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ షర్ఫ్యాద్దీన్, హెచ్ఈవో సాల్మోన్‌రాజ్, యశ్వంత్‌గౌడ్, టి.అమృత, పి.మంజుల, ఆశా వర్కర్లు ఎం.రమా, వై.అరుణ, కట్టప్ప, జి.హెచ్.కృష్ణ, యాదయ్య, డీఈవో శిల్ప పాల్గొన్నారు.

వెటర్నరీ విశ్వవిద్యాలయంలో..

ఏజీవర్సిటీ: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలని పీవీ నర్సింహారావు వెటర్నరీ విశ్వవిద్యాలయం ఉపకులపతి రవీందర్‌రెడ్డి అన్నారు. వెటర్నరీ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాన్ని గురువారం వీసీ ప్రారంభించారు. బోధన, బోధనేతర సిబ్బంది వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేసుకోవాలని అవసరమున్న వారికి ఉచితంగా అద్దాలు ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ ఉదయ్ కుమార్, డాక్టర్ చిన్న ప్రీతం వైద్యులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేయించుకుంటున్న వీసీ



కంటి వెలుగు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న శ్రీనాథ్‌రెడ్డి

కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం

దూద్‌బౌలి: కేంద్ర ప్రభుత్వ హయాంలో దేశంలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైందని మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకురాలు పుష్పలీల అన్నారు. కేంద్ర ప్రభుత్వానికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. గురువారం పాతబస్తీ ఉర్దూఘర్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై మండిపడ్డారు. రాష్ట్రంలో కేసీఆర్ కుటుంబ పాలన సాగిస్తూ.. వేల కోట్ల రూపాయలు వెనుకేసుకుంటున్నారన్నారు. ఈ అక్రమ డబ్బుతో రాబోయే ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధమవుతున్నారన్నారు. ఈసారి జరిగే ఎన్నికల్లో అటు కేంద్రంలో బీజేపీతో పాటు రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీలను ప్రజలు తిరస్కరించి ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుని అధికారంలోకి వస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాశమోనీ శ్యాంరావు ముదిరాజ్, ధిలావర్ హుస్సేన్, ముజీబుల్లా షరీఫ్, అస్లం తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి పుష్పలీల తదితరులు